# ఉపదేశం ★

కుమారి సిద్ధాబత్తుల సరోజ

ఆ వూళ్లో రామనాథం గార్కి ఇల్లు దొరకడం బ్రహ్మాండమైనంత సంతోషం అయింది. తాసిల్దారుగా ఆయనకున్న పలుకుబడిని ఉపయోగించి, ఆ పలుకుబడికి రెండువందల రూపాయిలు కలిపి కామాక్షమ్మకి ఇచ్చేటప్పటికి, ఆమె తన మేడలో పెద్దవాటా ఆయనకి అద్దెకిచ్చింది.

ఇంకా కొత్త ఇంట్లో ప్రవేశించడానికి నాలుగు రోజుల వ్యవధి వుందనగా సిద్ధాంతిగారు తాసిల్దారు గారింటికి వచ్చాడు.

"రేపు ఒకటవ తేదీకి కామాక్షమ్మ గారింట్లోకి మారుతున్నామండి. ఇన్నాళ్లకి మాకు ఓ శుభ్రమైన ఇల్లు దొరికింది, ఇంక ఈపాడు ఇంట్లో వుండనవసరం లేదు" అంటూ తన సంతోషాన్ని వెల్లడించింది తాసిల్దారుగారి భార్య లక్ష్మీకాంతమ్మ.

"ఏమిటీ! కామాక్షమ్మగారింటికి మారుతున్నారా? చూడమ్మా మీకు నేను చెప్పకూడదు కాని, ఆ ఇల్లు మంచిది కాదు. మరో ఇల్లు చూచుకోండి. ఈ విషయంలో మీకు కష్టం కల్గించానని ఏమీ అనుకోకండి" అని ఉపదేశించాడు సిద్ధాంతి.

"అయ్యో, అలాంటి ఇంట్లోకి ఎలా వెడతామండి. ఇదేం ఖర్మ. ఇంక ఇల్లే దొరక్కపోతుందా. ఇంటి యజమానురాలు సవ్యమైనది కాకపోతే అసలు వుండలేము. ఆయనరాగానే చెప్తానులెండి" అంది కాంతమ్మ.

"వస్తానమ్మా, ఇంకా కూరలు కొనుక్కోవాలి" అంటూ వెళ్ళిపోయాడు సిద్ధాంతి.

"ఏమండీ, ఆ ఇల్లు మంచిది కాదటగా ?" అంది కాంతమ్మ భర్తకి తమలపాకులు తెస్తూ.

"ఎవరన్నారే ఇల్లు మంచిది కాదని" కొంచం చిరాకు పడ్డాడు.

"ఎవరనడం ఏమిటండీ ? సిద్ధాంతిగారే అన్నారు" అంది ఆకులుకి సున్నం రాస్తూ.

"అన్నాడూ. ఆయనొకడు నా ప్రాణానికి. ఏదీ మంచిది కాదంటాడు ఆమధ్య ఓ బంగళా చూస్తే, ద్వారబంధం దక్షిణ మొహంగా వుంది పనికి రా [illegible] ఇల్లు మంచిది కాదన్నాడు. ఏమైనాసరే ఈ ఇంట్లోకి మారవలసిందే" అన్నాడు కోపంగా భర్త.

"అలా అంటే ఎలాగండి. ఇల్లు మంచిది కాకపోతే మనకేగా నష్టం. మనం అంటే సిద్ధాంతిగార్కి ఇష్టం లేక చెప్పారంటారా ? అసలే పెద్ద కోడలు కడుపుతో వుంది. తరువాత ఏమైనా బాధపడేది మనం. మరో ఇల్లు చూసుకుందాం లెండి" అంది ఆకులు మడతపెట్టి అందులో వక్కపొడి వేస్తూ.

"చూడు లక్ష్మి! సిద్ధాంతి ఆయన నోటికొచ్చినట్లు చెప్తాడు. ఈ ఇల్లు వదులుకుంటే మనకి ఈ వూళ్లో ఇంక ఇలాంటి ఇల్లు దొరకదు. పైగా ఈ సిద్ధాంతికి ఏదీ సరిగ్గారాదు. నా మాట విను. ఆ ఇంట్లో చేరాక, ఆ ప్లీడర్ గారు ఆరువేలు బ్యాంకులో వేశాట్ట" అన్నాడు భార్యని వప్పిద్దామని.

"ఎంత మాటన్నారండి సిద్ధాంతిగార్ని. ఆయన ఎన్ని పెళ్ళిళ్లకి ముహూర్తాలు పెట్టాడండి. ఆయనకి అప్పుడప్పుడు దేవుడుకూడ ప్రత్యక్షమవుతూ వుంటాడట. నిజంగా ఆయన్ని ఇక్కడికి దేవుడే పంపించాడు. లేకపోతే మనం ఆ ఇంట్లో చేరడం, ఏదో ఓ కీడు సంభవించడం జరిగేవి. మీరు ఎన్ని చెప్పండి, ఇంత సంసారంతో నే ఆ ఇంట్లోకి రాను" అంటూ మడత పెట్టిన చిలకలు ఆయన నోటికందించింది.

"నువ్వు చెప్పినట్లే కానీవే. మరో ఇల్లు చూస్తాలే. ఇంత మాత్రందానికే మనకి మనస్పర్థలు ఎందుకే పిచ్చి పిల్లా" అన్నాడు ఆమెకేసి చిలిపిగా చూస్తూ.

"ఇంకా పిల్లా ఏమిటండి, మొన్న పోలాల అమావాస్యకి నాకు ఏభయి సంవత్సరాలు నిండాయి" అంది కాస్త సరసంగా కాంతమ్మ.

సరిగ్గా ఒకటవ తేదీకి కామాక్షమ్మ ఇంట్లో సిద్ధాంతిగారు, ఆయన కుటుంబం వచ్చి కాపురం పెట్టారు, ఈ విషయం తాసిల్‌దారుగార్కి తెలిసి బిక్కమొఖం పెట్టుకొని, ఆమెపై కోపం జోడించి "ఇప్పటికైనా సిద్ధాంతి అంటే ఎవరో తెలుసుకో" అని భార్యకి ఉపదేశించాడు. ఉపదేశం అర్థమైనట్లు తల వూపింది డూ డూ బసవన్న లాగా. ★